www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 31 | మార్చి | 2026 పేజీలు : 8

## కమ్యూనిస్టు పార్టీలోనే సామాన్యులకు గౌరవం : బాగం



-కమ్యూనిస్టు పార్టీ ఆదరణ మరువలేనిది : మేయర్ గణేష్
-కొత్తగూడెం మేయర్‌కు ఘన సన్మానం

6లో..






## డిమాండ్లు నెరవేర్చకుంటే.. సింగరేణిలో సమ్మె సైరన్

**ఏఐటియుసి ప్రధాన కార్యాలయం ముట్టడి ఉద్రిక్తం** | **నారాయణ, వాసిరెడ్డి, పాషా, రాజ్‌కుమార్ సహా పలువురి అరెస్టు** | **సింగరేణిని దోచుకుంటున్నారు : నారాయణ**

డిమాండ్లు నెరవేర్చకుంటే సింగరేణిలో కార్మిక సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్లకు అనుగుణంగా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోకపోతే సమ్మె సైరన్ మోగిస్తామని సిపిఐ, ఏఐటియుసి నేతలు హెచ్చరించారు. ఏఐటియుసి పిలుపు మేరకు సోమవారం జరిగిన సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. కోల్‌బెల్ట్ ఏరియా నుంచి తరలి వచ్చిన వేలాది మంది కార్మికులు, సిపిఐ కార్యకర్తలు కొత్తగూడెం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద గంటల తరబడి ధర్నా నిర్వహించారు. పోలీసులు ధర్నాను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. సిపిఐ జాతీయ నాయకులు డా॥ నారాయణ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, కె. రాజ్‌కుమార్, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా సహా పెద్ద సంఖ్యలో నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని దోచుకుంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం దిగి రాకుంటే విపత్కర పరిస్థితులను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

-ప్రజాపక్షం

2లో





## సంక్షేమంలో గుత్తేదారుల రాజ్యం..!

-నోరు మెదపలేని స్థితిలో వార్డెన్లు
-మిలాఖత్ అవుతున్న కొందరు
-వారు ఇచ్చిందే సామగ్రి..
ఉన్నతాధికారుల మౌనం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సంక్షేమ వసతి గృహాల విషయంలో గుత్తేదారుల రాజ్యం నడుస్తుంది. వారు ఇచ్చిందే సామగ్రి చేసిందే బిల్లు అన్న చందంగా తయారైంది. కూరగాయల మొదలు దేని విషయంలోనూ నాణ్యత పాటించకపోయినా సంక్షేమ శాఖ అధికారులు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నాణ్యత లేని ఆహార పదార్థాల కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైతే వేటు మాత్రం సంక్షేమ అధికారులపై పడుతుంది. ఇప్పటికే ముదిరిన కొందరి కాంట్రాక్టర్ల తీరు తలను తోక ఆడించిన చందంగా తయారైందని సంక్షేమ శాఖాధికారులే వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది సంక్షేమానికి సంబంధించి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నది. దాని ప్రతిఫలం మాత్రం ఆశించిన స్థాయిలో అందడం లేదని ఒకవంతు గుత్తేదారులు, పైరవీకారుల పాలవుతుందన్న ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతుంది. గతంలో ప్రభుత్వం

మిగతా 2లో..

## పండుగ వాతావరణంలో గ్రామసభ నిర్వహించాలి



-సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలి
-గ్రామసభ నిర్వహణపై సమీక్షించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పండుగ వాతావరణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామసభ నిర్వహణపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ రెండున ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించాలన్నారు. గ్రామసభల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు. మండల స్థాయి అధికారులను వివిధ గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభల్లో పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు కూడా గ్రామసభ కార్యక్రమంలో పాల్గొనాలని

మిగతా 2లో..

# డిమాండ్లు నెరవేర్చకుంటే సింగరేణిలో సమ్మె సైరన్



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** సింగరేణి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వర్కర్స్ యూనియన్ చేపట్టిన సింగరేణి హెడ్డాఫీస్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతగా మారింది. కోల్‌బెల్టు ప్రాంతాల నుండి తరలి వచ్చిన వేలాది మంది కార్మికులు, .యూనియన్ కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. హెడ్డాఫీస్ చేరుకుని ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. పొర్లు దండాలతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మూడు గంటల పాటు ధర్నా చేపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు నేతలు, కార్మికులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో హెడ్డాఫీస్ ఎదుట తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. సిపిఐ జాతీయ నాయకులు డా.కె.నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషాతో పాటు యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తదితరులను పోలీసులు నిర్భందించి 1టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు ముందు కార్మికులను ఉద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డా.కె.నారాయణ మాట్లాడుతూ సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ.50 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని, ఆ నిధులను ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త గనులు ప్రారంభంపై యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్యం సంస్థ మనుగడగే ముప్పని, ఏసిబి విచారణ సాకుతోమెటికల్ బోర్డును నిలిపి వేయడం కార్మికులప్రాణాలతోచెలగాటం ఆడటమే మండిపడ్డారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు సింగరేణి సిరిని దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. కార్మికులకష్టంతో మనుగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ కార్మికులను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తోందని, ఇందులో మితిమీరిన రాజకీయ జోక్యమే కారణం అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే రాబోయే రోజుల్లో మరిన్నిగట్టి పోరాటాలు చేస్తామని, అవసరమైతే సింగరేణి కార్యాలయాలను స్వాదీం చేసుకుని తమ సత్తా చాటుతామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు,సొంతింటి పథకం వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. క్లర్క్ పోస్టులకు కోర్టు కేసులతో సంబంధం లేకుండా పరీక్షలు జరపాలని, 350 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటించాలన్నారు. సింగరేణి ఏరియాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పడ్డాయంటే అది కేవలం సింగరేణి కార్మికుల వల్లే అని, కోరితెచ్చుకున్న ప్రభుత్వం కార్మికుల నెత్తిన చెయ్యి పెడుతోందని మండిపడ్డారు. సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో మెడికల్ బోర్డు వల్ల సింగరేణికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ప్రకటించడం దుర్మార్గం అన్నారు. కార్మిక సంక్షోబం కోసం పాటు పడాల్సిన పాలకులు లేనిపోని మాటలతో కార్మికులను మనస్తాపానికి గురుచేయడం మంచిది కాదని హితవు పలికారు. కొత్త గనులు ఏర్పాటు చేసే క్రమంలో ప్రైవేటు పెత్తనానికి స్వస్థి చెప్పి సింగరేణి కార్మికులతోనే బొగ్గు ఉత్పత్తి చేయాలని, పాత పద్దతిలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నాయకులువాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు కార్మికుల గొంతుకగా నిలుస్తున్నారని కొనియాడారు. సింగరేణి యాజమాన్య తప్పుడు విధానాలతో కార్మికుల బ్రతుకులు తీవ్ర ఇబ్బందుల్లోకి వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేవ్ సింగరేణి నినాదంతో చేపట్టిన ఈ ముట్టడికి అనూహ్య స్పందన వచ్చిందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపకుంటే మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సంగరేణి కార్మికులతో చెలగాటం ఆడిన ప్రభుత్వాలేవి మనుగడ సాగించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, నాయకులు మిర్యాల రంగయ్య, కే సారయ్య, వీరభద్రం, వైవి రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్. జీ వీర స్వామి, ఎస్ వి రమణమూర్తి, వి మల్లిఖార్జున రావు, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో గ్రామసభ నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

కలెక్టర్ తెలిపారు. ప్రజాప్రతినిధులందరూ గ్రామసభల్లో పాల్గొనేవిధంగా ఆహ్వాన పత్రికలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీకి గత రెండున్నర ఏళ్ల కాలంలో అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన ప్రింటెడ్ మెటీరియల్ అందించాలని తెలిపారు. అభయ హస్తం, గ్యారెంటీ పథకాలు, సన్న బియ్యం సరఫరా వంటి అనేక పథకాలకు సంబంధించి వివరాలు గ్రామసభలో ప్రజల ముందు వినిపించాలన్నారు. పండుగ వాతావరణంలో గ్రామసభలో జరగాలని దానికి అనుగుణంగా ఎల్ఈడి స్క్రీన్లు, సౌండ్ సిస్టం, స్టేజీ డెకరేషన్ ఉండాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర గీతంతో గ్రామసభ ప్రారంభమవుతుందని అనంతరం సిఎం సందేశం, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను తెలియజేయడం లబ్దిదారుల వివరాలు వారి అభిప్రాయాలు తీసుకోవడం, ప్రజాప్రతినిధుల సందేశంతో కార్యక్రమం ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ సభ నిర్వహణకు ప్రతి గ్రామానికి బడ్జెట్ వచ్చిందని ఆ నిధులను వినియోగిస్తూ గ్రామసభ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ అధికారులు గ్రామసభ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

**వడదెబ్బ భారీనపడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి : కలెక్టర్**

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బ భారీనపడకుండా అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు ముందస్తు జాగ్రత్త చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వడగాల్పుల సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వివిధ శాఖల బాధ్యతలపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే ప్రథమ కర్తవ్యమని, వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఆసుపత్రులలో వడదెబ్బ చికిత్స ప్రోటోకాల్స్ పాటించాలన్నారు. ఓఆర్ఎస్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వడగాల్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మున్సిపల్, గ్రామీణాభివృద్ధి శాఖలు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పనుల సమయాన్ని సవరించాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు పాఠశాలల సమయంలో మార్పులు చేసేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్మిక శాఖ భవన నిర్మాణ కార్మికులకు మధ్యాహ్న సమయంలో విరామం, నీడ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్దులు, చిన్నపిల్లలు, బయట పనిచేసేవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమంలో గుత్తేదారుల రాజ్యం..!

**(మొదటిపేజీ తరువాయి)**

వివిధ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థుల పోషణ, సంక్షేమం తదితర విషయాలకు సంబంధించి నేరుగా సంక్షేమ వసతి గృహాల బాధ్యులకు నిధులను విడుదల చేసేది. ఇప్పుడు ఆ పద్ధతని కాదని కాంట్రాక్ట్ వ్యవస్థను తీసుకు వచ్చారు. సంక్షేమ వసతి గృహాల బాధ్యులకు నిధులు అప్పగిస్తే పక్కదారి పడుతున్నాయని ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త పద్ధతి మరింత అవినీతికి ఆస్కారం కల్పిస్తుంది. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా సన్న బియ్యాన్ని అందజేస్తుంది. ఒక బియ్యం మినహా మిగిలిన ఆహార పదార్థాలన్నింటిని సరఫరా చేసేందుకు గుత్తేదారులకు అప్పగించారు. చాలా మంది వివిధ స్థాయిల్లో టెండర్లు వేసి కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. నూనెలు, పప్పులు మొదలు దేని విషయంలోనూ నాణ్యత పాటించకుండా గుత్తేదారులు సరఫరా చేస్తుండడంతో తరచూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యతను పరీక్షించాల్సిన అధికారులు నోరు మెదపడం లేదని కాంట్రాక్టర్లు ఎవరికి కట్టాల్సిన కప్పం వారికి కడుతుండడంతో అధికారులు ఎవరు దీనిపై స్పందించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఉదాహరణకు 55 గ్రాముల కోడిగుడ్డును అందించాల్సి ఉండగా పిట్ట గుడ్లను తలపించే రీతిలో ఉండే గుడ్లను సరఫరా చేస్తున్నారని వీటిలో అధిక భాగం మురిగిపోతున్నాయని సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాజరు ప్రకారం కేటాయింపులు ఉండాల్సి ఉండగా కొందరు గైర్హాజరు విద్యార్థులకు హాజరు చూపి ఆర్థికంగా లబ్ది పొందుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సంక్షేమం విషయంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలని గుత్తేదారు వ్యవస్థను అమలు చేయదలిస్తే దానిని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా సంక్షేమానికి కేటాయించిన సొమ్ము ఇప్పుడు గుత్తేదారుల పాలవుతుంది. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే ఎంత ఖర్చు చేసినా ఫలితం దక్కకపోవచ్చు.

# రేపటి నుంచి ఇంటింటికి సిపిఐ



**-10 రోజుల పాటు సిపిఐ కార్యాచరణ**
**-ఖమ్మంలో బాగం, మధిరలో దండి,**
**పాలేరులో మౌలానా ప్రారంభం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి పది రోజుల పాటు ప్రతి గ్రామం, వార్డు, డివిజన్లలో సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం దానితో పాటే పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీశ్రేణులు మొత్తం ఈ కార్యాచరణలో పాల్గొంటాయని పది రోజుల సమస్యల గుర్తింపు, అధ్యయనం తర్వాత పరిష్కారానికి పోరాట కార్యాచరణను రూపొందిస్తామని సురేష్ తెలిపారు. పాలక వర్గాలు కొన్ని సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నాయని ఆయన తెలిపారు. యుద్ధం సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపెడుతుందని క్రమేపి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. యువత ఉపాధి లేక ఇబ్బందులు పడుతుందని దీనికి తోడు జాతీయ ఉపాధి హామీ పథకం చట్ట సవరణ ద్వారా వచ్చిన విబి జీ రాం జీ పథకం అమలులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా ఏప్రిల్ ఒకటి నుంచి 10 వరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఖమ్మంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు బుధవారం లాంఛనంగా ప్రారంభిస్తారని సురేష్ తెలిపారు. మధిరలో దండి సురేష్, పాలేరులో మహ్మద్ మౌలానా, చింతకానిలో జమ్ముల జితేందర్‌రెడ్డి మిగిలిన చోట్ల రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభిస్తారని సురేష్ తెలిపారు.

# ఒలింపియాడ్ విజేతలకు బహుమతి ప్రదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు ప్రధానం చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన గణితం, సైన్స్, ఇంగ్లీష్ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన 60 మంది చిన్నారులకు మెడల్స్, బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులను అన్ని రంగాలలో విజయం సాధించేలా ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ వారు రాణించేలా కృషి చేస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి తమ పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి




**-లేబర్ కోడ్‌ల రద్దుకై ఏప్రిల్ ఒకటిన బ్లాక్ డే**
**-అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటిన దేశవ్యాప్త బ్లాక్‌డే నిర్వహించనున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లోని ఏఐటియుసి కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన అఖిలపక్ష కార్మిక సంఘల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గత 100 ఏళ్లుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. కార్మిక చట్టాలలో అతి ముఖ్యమైన పారిశ్రామిక వివాదాల చట్టం, ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1926, పారిశ్రామిక ఉపాధి (స్టాండ్ ఆర్డర్స్) చట్టం, 1946 పారిశ్రామిక వివాదాల చట్టం 1947 తదితర చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో తీసుకువచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ 2022లో అన్ని అంశాలు ఉన్నట్లుగానే కనిపిస్తాయని కానీ అవి ఆచరణకు సాధ్యం కావని వారు తెలిపారు. మోడీ ప్రభుత్వం భవిష్యత్తులో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా కాలపరిమితితో కూడిన ఉద్యోగాలను సృష్టిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నివీర్, అగ్నిపధ్ లాంటి పథకాలతో ఈ విధానాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పారిశ్రామికవేత్తల ఆదేశాల మేరకు 12 గంటల పనివిధానాన్ని ప్రవేశ పెట్టి బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటకలో ఆమోదింపజేశారని వారు విమర్శించారు. దీని ఫలితంగానే కర్నాటక ప్రజలు ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మోడీ కార్మిక వ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు భారతదేశ వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటిన బ్లాక్‌డేను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన బ్లాక్‌డేను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. విష్ణువర్ధన్, ఐఎన్‌టియుసి టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల రామకృష్ణ, ఉపాధ్యక్షులు సిద్దెల నగేష్, టియుసిఐ రాష్ట్ర నాయకులు సివై పుల్లయ్య, కె. శ్రీనివాస్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు సుబాని, జిల్లా నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**-ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన పి. నాగులమీరా గ్రామంలో వారం రోజులుగా పిచ్చికుక్కలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కామేపల్లి మండలం శివారు లాల్ల తండా నివాసులు గ్రామంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతూ అమ్మకాలు చేస్తున్నారని అట్టి భూమిని కాపాడి ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం శ్రీరామ్ నగర్ రోడ్డు నెం. 13కు చెందిన స్థానికులు తమకు సిసి రోడ్డుతో పాటు డ్రైనేజీ, మిషన్ భగీరథ పైపులైన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ధాడి లంబాడ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ మున్నేరు నది సమీపంలో ఉన్న ధాడి లంబాడ సమాజానికి చెందిన పూర్వీకుల సమాధి స్థలాన్ని రక్షించుట, రిటైనింగ్ వాల్‌కు అనుబంధంగా ఉన్న సర్వీస్ రోడ్డు, డ్రైనేజీ కాలువ డిజైన్‌ను మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం బుర్హాన్‌పురంకు చెందిన పి. కృష్ణమూర్తి తనకు పక్షవాతం వచ్చి పదేళ్లు అవుతుందని దివ్యాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు మంజూరు కాలేదని వెంటనే మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల రెవెన్యూ పరిధిలో లంబాడీలు సాగు చేసుకుంటున్న 152 సర్వే నెంబర్ల గల అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు వినతిప్రతం అందచేశారు. గత 50 సంవత్సరాల నుండి లంబాడీలు అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్నారని, ఈ భూములకి పట్టాలు లేక ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందటం లేదని, వెంటనే కలెక్టర్ స్పందించి ఈ సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. తదనంతరం తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య వీరభద్రం మాట్లాడుతూ రావినూతల గ్రామపంచాయతీ పరిధిలో రెండు తండాలు ఉన్నాయని, ఈ తండాల్లో రోడ్లు సరిగ్గా లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వర్షం వస్తే బయటకి వచ్చే పరిస్థితి లేదని వెంటనే ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని కోరారు. అలాగే పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మాజీ సర్పంచ్ భూక్య జ్వాలు, రావినూతల గిరిజన సంఘం గ్రామ కార్యదర్శి బానోతు నాగేశ్వరరావు, పద వార్డు నెంబర్ ధరావత్ కృష్ణ,తండానాయక్, బాణోతు మాన్యానాయక్, గిరిజన సంఘం నాయకులు రావూరి హుస్సేన్ , మండల కన్వీనర్ గుగులోతు నరేష్ తదితరుల పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ఆశా వర్కర్ల నిరసన



**ప్రజాపక్షం/ బోనకల్ :** ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ చలో హైద్రాబాద్ కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లను అక్రమంగా పోలీసులు అరెస్టు చేయటానికి నిరసనగా సోమవారం బోనకల్‌లో ఆశా వర్కర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆశా వర్కర్లను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్ల యూనియన్ మధిర డివిజన్ కార్యదర్శి రావణ సరోజిని మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పెరిగిన ధరలకనుగుణంగా రూ.18వేలు ఇవ్వాలని, ఆశా వర్కర్లు ఎన్నికల సమయంలో ఆశాలకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని, ఆశాల న్యాయమైన సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మరీదు లీలా కుమారి, గద్దె తులసి, గుంగల విజయలక్ష్మి, కుక్కల నారాయణమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

# జీవో ప్రతులు దహనం




**ప్రజాపక్షం/ తల్లాడ :** మేడే కార్మికులు తమ రక్తం చిందించి సాధించుకున్న కార్మికుల హక్కులను బిజెపి ప్రభుత్వం ఒక కలం పోటుతో రద్దు చేసిందని టియుసిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అన్నారు. టియుసిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తల్లాడ పట్టణంలో టియుసిఐ ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్స్ జీవో ప్రతుల్ని దహనం చేయడం జరిగింది. అనంతరం టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.లాల్మియా పాల్గొని మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక రకాల చట్టాలను ఒక కలం పోటుతోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దు చేసింది ఈ చట్టాలను రాష్ట్రంలో అధికారం ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయను అని అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నటువంటి నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటంలో భాగస్వామ్యులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు జి.కృష్ణ, సత్యనారాయణ, బాలు, కృష్ణ, నరేష్, రమణ, రాఘవ, వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ పిహెచ్‌సిలో ఉచిత హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రత్యూష తెలిపారు.ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నుండి ప్రముఖ స్పెషాలిస్ట్ డాక్టర్ హాజరవుతారని పలు సమస్యలు గైనకాలజీ సమస్యలు, కీళ్ల నొప్పులు, చిన్న పిల్లల చికిత్స, సాధారణ వ్యాధులు, కంటి సమస్యలు, టిబి లక్షణాల పరిశీలన, ఉచిత రక్త పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేస్తామని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

# బాధితులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణ శివారులోని నీటి గుంటలో పడి మృతి చెందిన కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు బాజాపా జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు. సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించి, అక్రమంగా తవ్విన క్వారీలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల మృతికి బాధ్యులైన అక్రమ మైనింగ్ నిర్వహించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంతవరకు భారతీయ జనతా పార్టీ పోరాటం చేస్తుందని, ఇప్పటివరకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎందుకు క్వారీలని సందర్శించలేదని ఇదంతా అధికారులు కనుసన్నలోనే, అధికార పార్టీ వారి ఆదేశాల మేరకు జరుగుతున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, జిల్లా కార్యదర్శి పాలా నాగాసురేందర్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ నాయక్, స్థానిక పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు భానావత్ విజయ్, సాలి శివకృష్ణ,వేంసూర్ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మందా శివ, సాయిచంద్ర, మేకల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటి పరిధిలో సుమారు 20 రోజుల క్రితం మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం రాత్రి లభ్యమైంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొమ్మేపల్లి సింగరేణి క్వార్టర్స్ ప్రాంతంలోని జామాయిల్ తోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు పురుషుడిగా గుర్తించారు. శవం పూర్తిగా కుళ్లిపోయి అస్థిపంజర స్థితిలో ఉంది. మృతుడికి నీలం రంగు ప్యాంటు ధరించి ఉండగా, కుడి చేతికి ఎరుపు రంగు దారం కట్టుకొని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే దవడ భాగంలో శస్త్రచికిత్స చేసిన ఆనవాళ్లుగా ఐరన్ ప్లేట్ ఉన్నట్లు సమాచారం. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్యగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై సత్తుపల్లి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యక్తి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు సత్తుపల్లి పోలీస్ స్టేషనన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. 87126 59167,87125 51362 నంబర్లలో సంప్రదించాలన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వే రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** సమగ్ర కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులను జనగణన విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని టిఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం టిఎస్‌యూటిఎఫ్ బోనకల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఇఓ దామాల పుల్లయ్యకు వినతిప్రతాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ ఇప్పటి వరకు చెల్లించకపోవడం సరికాదని, వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న, అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను విధుల నుండి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల కోశాధికారి పి.నర్సింహారావు, మండల కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు, సత్యానందం, సర్వసతీ, పిఎల్‌టిఏ మంగతయారు, మండల ఉపాధ్యక్షులు సదాబాబు, పి.గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలి

**- కలెక్టర్ అంకిత్**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, దీనిని మెరుగైన సేవలతో ప్రభుత్వ ప్రతిష్టను నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం లక్ష్మీ దేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌లను పరిశీలించారు. మందులు నిల్వచేసే గదులను పరిశీలించారు. కావాల్సిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఓపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కనికీల్లో మెడికల్ ఆఫీసర్ స్వప్న, టిపిఎంఓ ఫార్మసిస్ట్ స్టాఫ్ నర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేడియాలజిస్టు సేవల్లో సరికొత్త రికార్డు



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** రేడియాలజిస్టు సేవలు జిల్లాలో సరికొత్త రికార్డును నెలకొల్పుతున్నారు. జిల్లా కలెక్టర్ చొరవతో టిఫా స్కానింగ్ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోనికి తెచ్చారు. భద్రాచలం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, చర్ల, అశ్వారావుపేట ఆస్పత్రుల్లో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ సేవలు అందుబాటులోనికి రావడంతో గిరిజన గ్రామీణ గర్భిణీలు దూరు ప్రాంతాలకు వెళ్లకుండా తమప్రాంతాల్లో అత్యాధునిక స్కానింగ్ సేవలు పొందే అవకాశం లభించింది. ఈ సేవల ద్వారా గర్భంలోని శిశువు అవయవాల అభివృద్ధిని ముందుగానే పరిశీలించి లోపాలను గుర్తించడం సులభం అవుతుందని, పేద, గిరిజన గర్భిణీలకు ఇది ఎంతో మేలు చేస్తుందని డిసిహెచ్ఎస్ డా. రవిబాబు తెలిపారు.

## దరఖాస్తుల పరిష్కారానికి చొరవ చూపాలి

**ప్రజాదర్బారులో పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** వివిధ ఆదివాసీ గ్రామాల నుండి తరలివచ్చి అందించిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు ఆయన హాజరై గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. అందుకున్న వినతులను పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ యూనిట్ల అధికారులు పాల్గన్నారు.

**ప్రజావాణిలో :** ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అంకిత్ పలువురి నుండి దరఖాస్తులు స్వీరించారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో అందించారు. అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగాపరిశీలించి పరిష్కరించాలని, వచ్చిన విన్నపాలను రిజిష్టర్‌లో నమోదు చేసి కంప్యూటర్‌లో పొందుపరచాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజెయు) జాతీయ కార్యవర్గంలోకి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ వైరా :** ఢిల్లీలో బ్యూరో చీఫ్‌గా ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ లో విధులు నిర్వహిస్తున్న వైరాకు చెందిన సీనియర్ జర్నలిస్టు తేలకోలు శ్రీనివాసరావు ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజెయు) జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. తేలకోలు శ్రీనివాసరావును విజయవాడలో జరిగిన జాతీయ సభల్లో నియాకం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఓఎస్‌డిగా 2014 నుంచి 2019 వరకు మల్లు భట్టివిక్రమార్క సిఎల్‌పి నేతగా ఉన్న సమయంలో పిఎస్‌గా ఢిల్లీ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో రెండు సార్లు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఢిల్లీ తెలుగు జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులుగా కూడా తేలకోలు శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహించారు. తేలకోలు శ్రీనివాసరావు నియామకం పట్ల వైరాలో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## పారదర్శకంగా ఇసుక సరఫరా కోసం మొబైల్ యాప్

**-మన ఇసుక వాహనం**
**మొబైల్ యాప్‌ను ప్రారంభించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** పారదర్శకంగా ఇసుక సరఫరా కోసం మన ఇసుక వాహనం మొబైల్ యాప్ రూపకల్పన చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మన ఇసుక వాహనం మొబైల్ యాప్‌ను అదనపు కలెక్టర్లు డా॥పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి మన ఇసుక వాహనం మొబైల్ యాప్ అమల్లోకి వస్తుందన్నారు. గతంలో ఫిజికల్ కూపన్ ద్వారా ఇసుక తరలింపు జరిగేదని దీని వల్ల కొన్ని అవకతవకలు జరిగే ఆస్కారం ఉందన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం మన ఇసుక వాహనం మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టిందని దీని ద్వారా ప్రతి అంశం ఆన్‌లైన్ ద్వారానే ఉంటుందన్నారు. ఇసుక ఎవరికి అవసరం ఉన్న యాప్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, సమర్పించిన దరఖాస్తు మేరకు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ వస్తుందని దాని ప్రకారం సంబంధిత లబ్దిదారులకు డెలివరీ చేసేవిధంగా ఈ యాప్‌ను తయారు చేశామన్నారు. జిల్లాలో ఇక నుంచి ఇసుక సరఫరా ఫిజికల్ కూపన్లు జారీ చేయడానికి వీలు లేదని దీనిపై తహసీల్దార్లకు ప్రత్యేకమైన సర్క్యులర్ జారీ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, భూగర్భ గనుల సహయ సంచాలకులు ఆర్. సాయినాథ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాములోరి వసంతోత్సవం

**-కోలాట నృత్యాలతో గ్రామ పురవీధుల్లో సీతారాముల ఊరేగింపు**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆళ్లపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. భద్రాచలంలో మాదిరిగా ఐదు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. కళ్యాణానికి ముందు రోజు ఎదుర్కోల్లు రెండవ రోజు స్వామివారి కళ్యాణం మూడవ రోజు దొంగల దోపిడీ నాలుగవ రోజు నాగవెల్లి 5వ రోజు వసంతోత్సవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి, ఈసందర్భంగా సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల విగ్రహాలను గ్రామ పురవీధుల్లో కోలాటం బృందాలతో డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగిస్తూ రంగులు పూసుకుంటూ ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు గౌరిశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నాగేశ్వరరావు, నరేడ్ల వెంకన్న, సిరినోముల వజ్రేశ్వరరావు, బూరుగడ్డ రాములు, అనుమోల వెంకటేశ్వరరావు, సంకా ప్రభాకర్, తెలగాని శ్రీనివాస్, నరేడ్ల శ్రీనివాస్, నువ్వుల నరసింహారావు, సిరినోముల శ్రీనివాస్ రావు, మంత్రి కృష్ణార్జున్, పానుగంటి నరసింహారావు, దొంగరి శోభన్, వినోద్, పండు కుమారస్వామి, పవన్, నరేడ్ల సాయి, నరేడ్ల సతీష్ యోగి, తెలగాని పురుషోత్తం, కోలాట బృందం,మహిళలు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు

**-బూర్గంపాడు పోలీసుల కఠిన చర్య**
**-చర్లపల్లి జైలుకు తరలింపు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితుడిపై బూర్గంపాడు పోలీసులు పీడి యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకున్నారు. బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన షేక్ మున్వర్(తండ్రి షఫీ)పలు పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు నమోదయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం 2024, 25 సంవత్సరాలలో బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, 2024లో లక్ష్మీ దేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు, అదే సంవత్సరంలో ఏదుళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదయ్యాయి. అదనంగా 2025 ఏప్రిల్ నెలలో దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 98 కిలోల గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తూ పట్టుబడగా అక్కడ కూడా కేసు నమోదు చేశారు. మొత్తంగా ఐదు కేసుల్లో షేక్ మున్వర్ సుమారు 287 కిలోల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ అక్రమార్జనకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పాల్వంచ డీఎస్పీ ఆర్ సతీష్ కుమార్ సూచనలతో పాల్వంచ సీఐ కె సతీష్ పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షణలో ఆధారాలను పరిశీలించిన సీఐడీ అదనపు డీజీపీ చారు సిన్హా 16 ఫిబ్రవరి 2026న డిటెన్షన్ ఆర్డర్ జారీ చేశారు. అనంతరం 18 ఫిబ్రవరి ఇ2026న ఆ ఉత్తర్వుల పత్రులను నిందితుడి షేక్ మున్వర్‌కు అందజేసి అతని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. అనంతరం 17 మార్చి 2026 అడ్వైజరీ బోర్డు ఈ కేసుపై విచారణ జరిపి భౌతిక, సాంకేతిక ఆధారాలను పరిశీలించి పీడీ యాక్ట్ కింద నిందితుడిని ఒక సంవత్సరం పాటు చర్లపల్లి జైలులో నిర్భందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా పాల్వంచ సీఐ సతీష్ మాట్లాడుతూ సమాజంలో ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హానికరమైన గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులను కోర్టు ఉత్తర్వులతో జప్తు చేసే చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** యాసంగి పంట కోతలు ప్రారంభమయ్యాయని, తక్షణమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, దాన్యం కొనుగోలు చేయాలని, అదే విధంగా సన్న వడ్లుకు బస్తాకు రూ.500 బోనస్ చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిదిలోని రామానగరం గ్రామంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని దండు పరిశీలించి మాట్లాడుతూ ధాన్యం ఆరబోసిన రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు బిక్కు బిక్కుమంటున్నారని, రైతుల అవసరాన్ని ప్రైవేట్ వ్యాపారస్తులు సొమ్ముచేసుకుంటున్నారని, రైతు కష్టం దళారుల పాలు కాకుండా ప్రభుత్వం వెంటనే ప్రతి గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల యొక్క ధాన్యాన్ని కొనుగోలు చేసి, బోనస్ చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కస్తూరి, నరసింహారావు ,దండు రాజా, జల్లిపల్లి రమణయ్య, కస్తూరి రాంబాబు, తోట రాంబాబు, పైగా నరసింహారావు ,జల్లిపల్లి సత్యనారాయణ, కొండారు శ్రీను తదితర రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు పక్కాగా నిర్వహించేందుకు చర్యలు

**ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం - సన్నాహక సమావేశంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యాసంగి (రబీ) ధాన్యం కొనుగోళ్లు పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్లు సన్నాహక సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ నుంచి ధాన్యం కొనుగోళ్ల వివరాలతో పాటు రైతులకు జరిగే చెల్లింపులు కూడా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు చెల్లింపులు జరిగినప్పుడే మన బాధ్యత పూర్తవుతుందన్నారు. ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని దీనిని ఇంప్రూవ్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి సంబంధిత రైస్ మిల్లులకు తరలించి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. గన్ని సంచులు మిల్లర్ల నుంచి పూర్తి స్థాయిలో సేకరించాలని తెలిపారు. ధాన్యం రవాణా వాహనాలు సరిగ్గా ఉండేలా చూడాలని ప్రతి వాహనానికి జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టం కాకుండా కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లను అందుబాటులో పెట్టాలన్నారు. అవసరమైన తేమ యంత్రాలు, ఇతర వసతులు అందుబాటులో ఉన్నాయో లేవో క్రాస్‌చెక్ చేసుకోవాలన్నారు. రైస్ మిల్లర్లతో ప్రత్యేకసమావేశం నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారం రోజుల లోపు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, మేనేజర్ శ్రీలత, వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, డిసివో గంగాధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, మండల ప్రత్యేకాధికారులు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు, అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు

**-రూ. 60 లక్షలతో మూడు అధునాతన స్వీపింగ్ యంత్రాల కొనుగోలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. రూ. 60 లక్షలతో కొనుగోలు చేసిన మూడు అధునాతన స్వీపింగ్ యంత్రాలను మేయర్ పునుకొల్లు నీరజ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పరిశుశ్రభతను మెరుగుపర్చడంతో పాటు పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆధునీక స్వీపింగ్ యంత్రాలను కొనుగోలు చేసి మూడు ప్రాంతాలకు కేటాయించినట్లు తెలిపారు. నగర ప్రజలకు పచ్చదనం, పరిశుభ్రత కల్పించడమే పాలక వర్గ లక్ష్యమన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణలాల్, డిఈ రంజిత్ కుమార్, ఏఈలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధిహామీ నిర్వీర్యానికి కుట్ర..?

**అందని వేతనాలు.. కనీస సౌకర్యాలు..**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రభుత్వాలు మారుతున్నా, చట్టాలు రూపాంతరం చెందుతున్నా ఉపాధి హామీ కూలీల తలరాతలు మాత్రం మారడం లేదు. నిప్పులు చెరిగే ఎండల్లో చెమటోడ్చుతున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జూలూరుపాడు మండల కేంద్రంలోని కప్పలకుంట ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు యాసా నరేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీల కోసం కనీసం తాగడానికి మంచినీళ్లు, ఎండ దెబ్బ తగలకుండా టెంట్లు, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనల వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా, కూలీలకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం అన్యాయం. పొట్టకూటి కోసం పనికి వస్తున్న పేదలను ఆకలితో అలమటించేలా చేయడం తగదు అని ఆయన ధ్వజమెత్తారు.

**ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్ర...?**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో అనవసర మార్పులు చేస్తూ, పరోక్షంగా కూలీలను ఈ పథకం నుండి దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. రెండు పూటలా ఫొటోలు తీసే విధానం ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు భారంగా మారిందని, తక్షణమే పెండింగ్ వేతనాలను విడుదల చేసి, పని ప్రదేశంలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బోడ అభిమిత్ర, గార్లపాటి వెంకటి, బల్లి లక్ష్మయ్య, ఎస్.కె.పర్వీన్, వసంత పాల్గొన్నారు.

## గుట్ట వెంకన్న స్వామికి విశేష పూజలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ శ్రీనివాస కాలనీలోని శ్రీనివాసగిరిపై స్వయంభూగా వెలసిన శ్రీదేవి భూదేవిసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 16 రోజుల విశిష్ట పూజలు, అభిషేకములను సోమవారం అత్యవంత వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారికి కళ్యాణం నిర్వహించి 16 రోజులు సంధర్భంగా స్వామి వారి పాదాల మండపం వద్ద ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్‌శర్మ, అర్చకులు ఫణిరాజచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పుష్పాభిషేకం జరిపించి 16 రోజుల పండుగను నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణానికి సంభందించిన జమా, ఖర్చులు తదితర వివరాలను కమిటీ సభ్యులు స్వామివారికి సమర్పించారు. కళ్యాణానికి విరాళాలు సమర్పించిన దాతలు, 16 రోజుల పండుగకు తరలి వచ్చిన భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు.అనంతరం వెంకన్నస్వామి కళ్యాణాం సంధర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా కూరగాయలను అందజేస్తున్న భక్తులను సన్మానించారు. 16 రోజుల పండుగను వీక్షించిన భక్తులకు కళ్యాణ తలంబ్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా ట్రస్ట్ చైర్మన్ కొత్తా వెంకటేశ్వరరావు, కో చైర్మన్ మందడపు ముక్కంటేశ్వరరావు, సేవా ట్రస్ట్ అధ్యక్షులు బిక్కసాని సుధాకర్ రావు, సభ్యులు కొప్పరపు మధుసూధన్ రావు, భక్త సమాజ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఊకె భద్రయ్య, తాటికొండ శ్రీలత, గౌర సలహాదారులు వంకదారు నరసింహకుమార్, కోశాధికారి పిట్ట లక్ష్మిరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ కందుకూరి రామక్రిష్ణ, బండి నారాయణ, ఉపాధ్యక్షులు చనుమోలు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి ఏటుకూరి నరేష్, ప్రధాన కార్యదర్శి జిన్నె రమేష్, సాంస్కృతిక బళ్ళమూడి విజయలక్ష్మి, సేవాదళ్ అధ్యక్ష, కార్యదర్శులు కొండ్రు శివ, పర్శక కిరణ్, మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిడమనేని అనూష, రేనాటి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణాదారుల అరెస్టు రిమాండ్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్ పంపించినట్లు అశ్వాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లగూడెం వద్ద ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలలో భాగంగా గంజాయి రవాణాదారులతో కూడిన కారుని పట్టుకోవడం జరిగిందని, దానిని చెక్ చేయగా అందులో 57500రూపాయల విలువైన ఒక కేజీ 150 గ్రాముల గంజాయిని కనుగొనడం జరిగిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన ముస్తాపూర్ రాహుల్, ముస్తాపూర్ ప్రశాంత్, బిత్తిరి విజయ్‌కుమార్, యోగేంద్ర జాదవ్ అనువారు మల్కానగిరి జిల్లా కోరుకొండకు వెళ్లి అక్కడ నుండి వచ్చే క్రమంలో తమతో పాటుగా గంజాయిని తీసుకువచ్చారని, వారి యొక్క వాహనములను తనిఖీ చేసే క్రమంలో అనుమానాస్పదంగా వ్యవహరించడంతో అట్టి వాహనుమును ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది తనిఖీ చేయగా గంజాయి బయటపడిందని దీనికి సంబంధించి పై నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. అలాగే కారు సీజ్ చేయడమైనదని, ఎవరికైనా గంజాయికి సంబంధించిన సమాచారం తెలిసిన డయల్ 100కి గాని ఎస్‌హెచ్ఓ అశ్వాపురం 8712682093కి గాని తెలియజేయాలన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

**-ఐదవ రోజుకు చేరిన పోరాటం**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఐదవ రోజు దీక్షలో కాంట్రాక్ట్ కార్మికుల పక్షాన సంధిపాము బాబు, కుందూరు శ్రీనివాసరెడ్డి, నీలకంఠం వెంకటేశ్వర్లు, అద్దనపు గోపాలరావు, షేక్ చాంద్ పాషా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యంగా బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు, ఐటీసీ బీఆర్టీయూ అధ్యక్షులు, ఐటీసీ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ కన్వీనర్ సానికొమ్ము శంకర్‌రెడ్డి హాజరై దీక్షలో పాల్గొనే వారికి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐటీసీ ఎంప్లాయిస్ జేఏసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్య, జేఏసీ సభ్యులు సింగరపు సతీష్, కందాల వెంకట్‌రెడ్డి, ఈతకోటి జాన్సన్, చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదరణను చూసి తట్టుకోలేకనే ఆరోపణలు

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దరావత్ రాంబాబు**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పొంగులేటి శ్రీనివాస రెడ్డి కు పెరుగుతున్న ప్రజాదరణ చూసితట్టుకోలేక బిఆర్ఎస్ నాయకులు అసత్య ఆరో పణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దరావత్ రాంబాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని టిఆర్ఎస్ శాసనసభ్యుడు హరీష్ రావుపై విమర్శలు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను చూసి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో విజయవంతంగా ఎదిగి సంపాదించిన సంపదను ప్రజల సేవకే వినియోగించేందుకు రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. అలాంటి నాయకుడిపై విమర్శలు చేయడం సరి కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉపయోగించు కుని కొందరు అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. మైనింగ్ రంగంలో అక్రమాలు జరుగుతున్నాయన్న విషయంపై కూడా విమర్శలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీలో అలాంటి వ్యవహారాలకు చోటు లేదని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంబాబు విమర్శించారు.

## క్రీడలు పట్టుదలను పెంపొందిస్తాయి



**ప్రజాపక్షం/పాల్వంచ :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటుగా పట్టుదలను పెమఫొంది స్తాయని కేటిపిఎస్ చీఫ్ ఇంజనీర్లు మేక ప్రభాకర్‌రావు, జైసూర్యనారాయణలు అన్నారు. స్థానిక విద్యుత్ కళాభారతి గ్రౌండ్‌లో టిజి జెన్‌కో ఇంటర్ ప్రాజెక్టు ఫుట్‌బాల్, కల్చరల్ అండ్ షటిల్ బ్యాట్‌మెంటన్ క్రీడలని సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్పూర్తిని ప్రదర్శించాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించుకొని తప్పులను సరిదిద్దుకొని రేపటి విజయానికి పునాదులుగా వేసుకోవాలని చెప్పారు. డిఎవి పాఠశాలకు చెందిన బాలురు కల్చరల్ బ్యాండ్ వాయిద్యంతో అలరించారు. ఈ క్రీడల్లో కేటిపిఎస్ ఐదు, ఆరు, ఏడవ దశలు, బిటిపిఎస్ కేటిపిపి పులిచింతల సింగూర్ టీమ్‌లు పాల్గొన్నాయి.ఎస్‌సి సివిల్ మోక్షవీర్, డిప్యూటి స్పోర్ట్స్ రామారావులు క్రీడలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీలు వీరస్వామి, మహేష్, జమీల్, అరుణ్, బాబి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు పార్టీలోనే సామాన్యులకు గౌరవం : బాగం




ప్రజాపక్షం/ ఖమ్మం : కమ్యూనిస్టు పార్టీలోనే సామాన్యులకు గౌరవం ఉంటుందని మారిన రాజకీయ సామాజిక పరిస్థితుల్లో సామాన్యులకు సైతం ఉన్నత పదవులు కమ్యూనిస్టు పార్టీలోనే లభిస్తాయని హేమంత రావు తెలిపారు. ఎన్నికలు అంటేనే డబ్బు ఖర్చు చేయడం సామ దాన దండోపాయాలకు వేదికగా మారిన ఈ రోజుల్లో సామాన్యమైన వ్యక్తిని మేయర్‌ను చేసి కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షమేనని రుజువు చేసింద న్నారు. ఇటీవల జరిగిన కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ పక్షాన మేయ ర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్‌ను సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు, బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టు పార్టీ ఎజెండా అని అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధు లుగా ఎన్నికైన వారు ప్రణాళికాబద్ధ కార్యాచరణ, అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. సన్మాన గ్రహీత మూడ్ గణేష్ మాట్లాడుతూ సామాన్యమైన కార్యకర్తగా ఉన్న తనకు కమ్యూనిస్టు పార్టీ ఒక అద్భుత అవకాశాన్ని కల్పించిందని నాలాంటి సామాన్యులకు అవకాశాలు ఇచ్చి ఉన్నత స్థానాలకు చేర్చడం కమ్యూనిస్టు పార్టీలోనే సాధ్యమన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశంతో పేదల అభ్యున్నతికి ముఖ్యంగా కొత్త గూడెం కార్పోరేషన్ అభివృద్ధికి శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాతో కలిసి కృషి చేస్తానన్నారు. సిపిఐ జిల్లా సమితితో పాటు వివిధ మండల సమితులు, ప్రజా సంఘాలు మేయర్ గణేష్‌తో పాటు విజయంలో కీలక భూమిక పోషించిన ఎస్‌కె సాబీర్‌పాషాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్య దర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు కె. నారాయణ, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# యాదవ సర్పంచులు, కౌన్సిలర్లకు సన్మానం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ యాదవ మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలోని యాదవ సర్పంచులు, ఉప సర్పంచులు, మున్సి పల్ వార్డు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. సోమవారం ఖమ్మం మధురానగర్ కాలనీలో గల శ్రీ గోకులకృష్ణ సేవా సమితి ట్రస్ట్ భవన్‌లో తెలం గాణ యాదవ మహాసభ ఆధ్వర్యంలో సర్పం చులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లకు అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా తెలంగాణ యాదవ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన వారు కృషి చేసి ప్రజల హృద యాల్లో చెరగని ముద్ర వేసుకోవాలన్నారు. రాజకీయంగా మరింత ఉన్నత స్థానానికి ఎద గాలని ఆకాంక్షించారు. సభాధ్యక్షులుగా వై రా మాజీ మార్కెట్ ఛైర్మన్ తుమ్మా రోశయ్య వ్యవహరించారు. బిసి సంఘం నేతలు, ఆర్ జెసి కృష్ణ, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగాని వెంకన్నగౌడ్, ఆర్కా హాస్పటల్ ప్రముఖ వైద్యులు బీశం వెంకటేశం యాదవ్, యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మేకల సుగుణారావు, జిల్లా అధ్య క్షులు కోడి లింగయ్య, బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్బూర్, మహిళా అధ్యక్షురాలు చిత్తారు ఇందుమ తి, మహిళా కార్యదర్శి కమల, యూత్ అధ్యక్షులు మల్లేష్, రాష్ట్ర నాయ కులు గంగరాజు, మాజీ జెడ్పిటిసి హైమావతి, ఎంపిపి సత్యం, పలు వురు యాదవ ప్రముఖులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివి క్రమార్క సతీమణి మల్లునందిని విక్రమార్క ఆధ్వర్యంలో మధిరలోని భట్టి క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. తనకుమారిడి వివాహ శుభ సందర్భంగా మధిర పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారి శుధ్య కార్మికులు, సిబ్బందికి నూతన వస్త్రాలను బహూకరించారు. పట్టణ పరిశుభ్రత, అభివృద్ధిలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో కీల కమని, వారు అహర్నిశలు శ్రమించి ప్రజలకు సేవ చేస్తున్నారని ఈ సందర్భంగా నందిని కొనియాడారు. నూతన వస్త్రాలను అందుకున్న కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. తమను గుర్తించి గౌరవించినం దుకు మల్లు నందినికి, భట్టివిక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కమీషనర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి రామారావు, పులి బండ్ల చిట్టిబాబు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు వెంకటరమణగుప్తా, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బిలారి సత్యనారాయ ణరెడ్డి, అద్దంకి రవికుమార్, దుంపా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/వైరా: వైరాలో వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రబీ సీజన్‌లో పండిన మొక్కజొన్నలు కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సిపిఎం డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దా ర్‌కు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల్లో పైగా రబీ సీజ న్‌లో మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొను ఓగలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు మొక్కజొన్నలు క్వింటాకు రూ.1600, రూ.1700లకు కొనుగోలు చేస్తు న్నారని, దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు రూ.2400లు ఉందని, మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సింథటిక్ ట్రాక్ పనులు పూర్తి చేయాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సింథటిక్ ట్రాక్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సోమవారం సర్దార్ పటేల్ మైదా నంలో నిర్మాణంలో ఉన్న సింథటిక్ ట్రాక్ పనుల ను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాక్ నిర్మాణంలో మిగిలిన పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

# గంజి నారాయణకు టిడిపి నివాళి



ప్రజాపక్షం/ మధిర : తెలుగుదేశం పార్టీ ఆవి ర్భావం నుండి తుది వరకు పార్టీలో కొనసాగిన సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గంజి నారాయణ ఇటీ వల మృతి చెందిన సంగతి విధితమే. సోమవారం దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో ఆయన సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటరీ టిడిపి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన అకాల మృతి టిడిపికి తీరని లోటన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్‌బాబు, బిటిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి వేమూరి సునీల్, మధిర రూరల్ మండల అధ్యక్షులు మార్నీడి పుల్లారావు, నాయకులు చెరుకూరి కృష్ణారావు, వల్లికొండ రామమ్మోహన్‌రావు, వాసిరెడ్డి ఉపేంద్ర, వాసిరెడ్డి కృష్ణ, ఈశ్వర్, మాదల నర్సింహారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# గుండెపోటుతో ఆదూరి బిక్షం మృతి

## నివాళులు అర్పించిన కౌన్సిలర్ నల్లమోతు శైలజ సురేష్




ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దుపూడి గ్రామంలో ఆదివారం కూ లి పనులకు వెళ్లిన ఆదూరు బిక్షం(60) వడ దెబ్బ తగలడంతో మృతి చెందారు. రోజు కూలి పనులు చేసి జీవనం కొనసాగించే ఆదూరు బిక్షం మరణించడంతో ఆ కుటుంబం విషాదఛాయలో కన్నీటిపర్యం అయింది. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ, సురేష్, నల్లమోతు సురేష్, కొత్తా వెంకటేశ్వరరావు, కొత్తా మధు, మాచర్ల నాగభూషణం, పోట్ల గోపాలరావు,అ మర్లపూడి లాజర్, మెరుగు వెంకట్, కిలారు పుల్లయ్య, ఆదూరి బిక్షం ఇంటికి వెళ్లి భౌతికకాయం వద్దపూలమాల వేసి నివాళులు అర్పించారు.

# రెండు ప్రాణాలు రూ.2 లక్షలు

ప్రజాపక్షం/సత్తుపల్లి: మట్టి క్వారీలో పడి మృతిచెందిన ఇద్దరు చిన్నారుల ప్రాణాలకు ఖరీదు రూ.2 లక్షలుగా లెక్కగట్టారు పెద్ద మనుషులు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద చిన్నారుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించకుండా తల్లిదండ్రుల ఆందోళన చేయటంతో దిగివచ్చిన సదరు భూ యజమాని పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదుర్చుకున్నాడు. ఎన్టీఆర్ నగర్ శివారు, రేజర్ల రెవెన్యూ పరిధిలోని రైతు కొప్పుల శ్రీనివాస్ రెడ్డి ఎటువంటి అనుమతులు లేకుండా మామిడి తోటలో మట్టిని తీయించారు. ఈ క్రమంలో పరిమితులకు మించి 40 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వారు సదరు మట్టి తోలకం దారులు. ఆ గుంటలలో నీరు నిల్వ ఉండి, ఊబి ఏర్పడటంతో గేదెలు మేపేందుకు వెళ్లిన చిన్నారులు ఒంటిపూడి దేవ (13), ఒంగూరి నాగబాబు (12)లు నీటిని చూసి సరదా కోసం నీటిలోకి దిగి ఊబిలో కూరుకుపోయి మృతిచెందారు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చి ప్రాణాలకు ఖరీదు కట్టారు.

# అఖిలపక్షం నాయకులపై పెట్టిన కేసు కొట్టివేత



ప్రజాపక్షం/ములకలపల్లి: పోడు భూముల పరిరక్షణ కోసం 2021 సంవత్సరంలో మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిమిత్తం అఖిలపక్ష నాయకులపై పెట్టిన కేసును సోమవారం కొత్తగూడెం కోర్టులో కొట్టివేశారు. మండలంలోని ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, వేలాది మంది గిరిజనులతో ర్యాలీ ప్రదర్శన ధర్నా నిర్వహించిన అఖిలపక్షం నాయకులపై ఆనాటి ప్రభుత్వం 21 మంది నాయకులపై కేసు పెట్టారు. ఆ రోజు నుంచి కోర్టులో నిరంతరం వాయిదాలకు హాజరవ్వాడం జరిగింది. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పోరాటంలో ఎన్ని నిర్బంధాలు ఎదురైన ప్రజల పక్షాన నిలబడుతామని అన్నారు. కేసులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కేచ్చల రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, అఖిలపక్ష నాయకులు నరాటి ప్రసాద్, ముద్దా బిక్షం, నూపా భాస్కర్, సున్నం నాగమణి, ముదిగొండ రాంబాబు, పెటేటి నరసింహారావు, కిషోర్, లక్ష్మణ్, సరోజిని, పద్మ, చిట్టిబాబు, భద్రం, తదితరులు ఉన్నారు. ఈ కేసులో లాయర్లు దుర్గారావు, మహేష్, సునీలులు వాదనలు వినిపించడం జరిగింది.

# మనమందరం చిత్తశుద్ధితో పనిచేద్దాం






-ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి
-వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి
-వైరా ఏసిపి సారంగపాణి



**ప్రజాపక్షం/వైరా:** వైరా పోలీస్‌స్టేషన్‌లో ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులకు, డ్రైవర్లకు , డ్వాక్రా మహిళలకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైరా ఏసిపి ఎస్.సారంగపాని మాట్లాడుతూ మీ ప్రాంతాల్లో ఎలాంటి పనులు చేపట్టాలి శాంతియుత ప్రశాంత పద్ధతుల పరిరక్షణలో పలు సూచనలు, సరపచ్‌లు, కౌన్సిలర్‌లు చేయాలని అన్నారు. చిత్తశుద్ధితో అందరం కలిసి మంచి కార్యక్రమం చేద్దాం అందరికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రజలను ఎక్కించుకోవద్దు, వాహనాలకు లౌడ్ స్పీకర్లు ఉపయోగించవద్దు, మహిళల పట్ల చాలా జాగ్రత్తలు పాటించాలి వారిని గౌరవించాలి, అతివేగంగా వాహనాలు నడిపేటప్పుడు ఎదుటి వాహనాన్ని ఓవర్టేక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వాహనాన్ని నడపాలి, ఎదురు ఎలాంటి వాహనాలు లేనప్పుడే ఓవర్ చేయాలని సూచించారు. యువత త్రిబుల్ రైడ్ చేయడంతో పాటు రకరకాల విన్యాసాలు చేస్తూ అతివేగంగా దూసుకుపోతున్నారని, అలాంటి మీ జీవితానికి ఎంతో ప్రమాదమని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు వాహనాలు ఇచ్చేటప్పుడు ప్రమాదాల గురించి వారికి వివరించాలని అన్నారు. అనుకోని సంఘటన జరిగితే కుటుంబంలో ఎన్నో నష్టాలు జరరగుతాయి. కొన్ని కొన్ని కుటుంబాలు చిందరవందరగా మారిపోతాయి, కుటుంబాన్ని పోషించే పిల్లలు కళ్ళ ముందలే ప్రమాదంలో గురైతే ఆ బాధ జీవితాంతం ఉంటుందని, అలా కాకుండా ప్రతి ఒక్కరూ కూడా బాధ్యతగా భావించి ప్రమాదాల గురించి పిల్లలకు వివరించాలన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని సూచించారు. ప్రతి వాహనదారుడు కారు లారీ ఆటోలు ట్రాక్టర్స్ ద్విచక్ర వాహనాలకు ముందు వెనుక రేడియం స్టిక్కర్లు వేసుకోవడం వలన ఎదురుగా ఉండే వాహనాలు మనకు కనిపిస్తాయి. ప్రమాదాలను కూడా నివారించవచ్చు అని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలను నడపవద్దు, ప్రమాదాలను కొన్ని తెచ్చుకోవద్దని అన్నారు. ఇలాంటి విషయాలు ప్రతిఒక్కరికి తెలిసే విధంగా మీరు మేము కలిసి ప్రతి గ్రామంలో వార్డుల్లో పబ్లిక్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేసి ప్రజలను చైతన్యవంతులు చేద్దాం ప్రమాదాలను నివారిద్దాం అని అన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు, వారికి వాహనాలు ఇచ్చినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ బాధ్యత తల్లిదండ్రులదే, వారిపై కూడా కేసులు నమోదు చేస్తాం, ఇటీవల కాలంలో చింతకాని మండలంలో మైనర్ డ్రైవింగ్‌లో ప్రాణాలు కోల్పోయాయని ఆ ప్రమాద విషయంలో మైనర్ బాలుడు తల్లిదండ్రులపై కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం యువత మత్తు పదార్థాల జోలికి పోకుండా ప్రతి కుటుంబం సభ్యులు వారి పిల్లలను మందలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మత్తు అంటే గంజాయి కొకైన్ లాంటి వాటికి బానిస అయ్యి భవిష్యత్తును పాడు చేసుకోవడంతో పాటు మత్తులో వారు ఏం చేసేది కూడా అర్థం కాని పరిస్థి ఉంది. అలాంటి మత్తును పారద్రోలేందుకు ప్రతిఒక్కరూ మత్తు నిర్మూలన ధ్యేయంగా పనిచేయాలి, దానికి ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు దాతలు ముందుకు వచ్చి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎంతో మంచిది అన్నారు. ఒక్క సిసి కెమెరా 100 మందితో సమానం. ఎలాంటి దొంగతనాలు గొడవలు జరిగిన కూడా వెంటనే కనిపెట్టవచ్చని ఏసిపి సారంగపాణి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, ఎస్సై పుప్పాల రామారావు, అదనపు ఎస్సై పవన్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, డ్రైవర్లు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## కరకగూడెం మండలంలో రైతు ఉత్పత్తి సంఘాలకు శిక్షణ



**ప్రజాపక్షం/కరకగూడెం:** కోనేరు సంస్థ ఆధ్వర్యంలో కరకగూడెం మండలంలో భట్టుపల్లి రైతు వేదికలో మండల స్థాయి సమావేశం జరిగింది. మండల కోఆర్డినేటర్ పగుట్ల వెంకటేశ్వరరావు ఫోకస్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ లో భాగంగా గ్రామ పంచాయతీలలో జరిగిన జీవనోపాధి కార్యక్రమాలు గురించి వివరించారు. ప్రాజెక్ట్ లో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు ఇచ్చిన ఎత్తిపోతల పథకం, సమీకృత వ్యవసాయ పద్ధతి, వ్యవసాయ ఉద్యానవన పంటలు, న్యూట్రీ గార్డెన్లు, ఏపిసి, విత్తన బ్యాంకులు, సహజ జీవ వనరుల తయారీకేంద్రం గురించి వివరించారు. రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసి వారికి శిక్షణలు ఇవ్వడం జరిగింది అని మండల కోఆర్డినేటర్, పిపిటి ద్వారా వివరించారు. వచ్చే 20262027 ఆర్థిక సవత్సరం లో చేయబోయే పనులు గురించి కూడా వివరించారు. ఈ సమావేశం లో మండల ఎంపిడిఓ దేవ వర కుమార్ ప్రాజెక్ట్ కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు ఎంపిడిఓ దేవ వర కుమార్, అగ్రికల్చర్ ఆఫీసర్ చటర్జీ, ఆర్ఐ కిరణ్, సెర్ఫ్ ఏపిఎం వినోద్ క్రాంతి, ఎలక్ట్రికల్ ఏఈ రాజశేఖర్, పద్మాపురం, తాటిగూడెం, రేగళ్ళ, చిరుమళ్ళ , అనంతారం, తాటిగుడెం, కన్నాయిగూడెం గ్రామపంచాయతీల సర్పంచులు, సెక్రెటరీలులు, విజయ్, రామకృష్ణ, వీరన్న, శ్రీనాథ్, కోనేరు, సంస్థ సిబ్బంది పోలెబోయిన నరేష్, రైతులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో శ్వాస మీద ధ్యాస కార్యక్రమం 41వ రోజు పూర్తి





**ప్రజాపక్షం/కారేపల్లి:** కస్తూరిబా బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న శ్వాస మీద ధ్యాస ధ్యాన కార్యక్రమం సోమవారంతో విజయవంతంగా 41వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. బ్రహ్మశ్రీ పత్రీజీ చూపిన ధ్యాన మార్గంలో శ్వాసపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా మనసుకు ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలిపారు. ఇటువంటి ధ్యాన కార్యక్రమాలు విద్యార్థినుల్లో మానసిక స్థైరాన్ని పెంపొందించడమే కాకుండా చదువులో మెరుగైన ఫలితాలకు దోహదపడతాయని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. 41 రోజుల పాటు నిరంతరంగా కొనసాగిన ఈకార్యక్రమం విద్యార్థినుల్లో మంచి స్పందనను పొందింది. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ముక్క స్వరాజ్యలక్ష్మీ , ఎస్ వెంకటేశ్వర్లు, కే రమేష్, సిహెచ్ శ్రీనివాస్, ఆర్ సుజాత, ఝాన్సీ, శ్రీలక్ష్మి , పద్మశ్రీ, సంధ్య, బుజ్జమ్మ, ప్రవల్లిక, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ ఝాన్సీ సౌజన్య, అధ్యాపక బృందం, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి తహసీల్దార్‌గా పి.రాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండల నూతన తహసీల్దార్‌గా పి. రాంప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం రూరల్ మండలం నుండి బదిలీపై వచ్చిన ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాంప్రసాద్ మాట్లాడుతూ, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, రెవెన్యూ పరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా చూస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యాలయ విధుల్లో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి. కనకం నరసింహ రావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లు అల్లం రవి, ఆలస్యం మధుసూధనరావు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొని నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అకాల వర్షం..అపార నష్టం




**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆదివారం రాత్రి కురిసిన అకాలవర్షానికి మొక్కజొన్న రైతులకు అపార నష్టం జరిగిందని ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల నాయకులు పుణెం రంగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల చేతికి అందిన మొక్కజొన్న పంట ఆదివారం గాలితో వచ్చిన వర్షంతో రైతులు సుమారు వందల ఎకరాలలో పంట నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఒక పక్క రైతు భరోసా రాక ఒక పక్క యూరియా కష్టాలతో రైతులు నానా అవస్థలతో సేద్యం చేస్తుంటే ఒక పక్క ప్రకృతి కన్నెర్రతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క రైతు లక్షలలో నష్టపోయారని కావున నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గుమ్మడి నరసింహారావు, మీడియం చందు, గుమ్మడి నరేష్, ఎట్టి నరేష్, పుణెం ప్రశాంత్, పుణెం లక్ష్మ ణ్, పాల్గొన్నారు.

## ఆదివాసి మహిళపై దాడి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో ఆదివాసి మహిళ పూనెం కమలపై దాడి చేసిన ఆమె ఇంటి స్థలాన్ని ఆక్రమించి ఘటనను తుడుం దెబ్బ(ఆదివాసీ హక్కుల పోరాట సమితి)తీవ్రంగా ఖండించింది. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నాయకులు కొడెం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మామకన్ను గ్రామానికి చెందిన పూనెం కమల తన భర్త పేరిట ఉన్న 4గుంటల ఇంటి స్థలంలో నివస్తిండగా, మార్చి 26న సయ్యద్ రఫీ, సాబీ హుస్నీసా, ఎస్‌డి మహబూబ్ పాషా, పఠాన్ పాషా తదితరులు అక్రమంగా స్థలంలోకి ప్రవేశించి దాడి చేసి బయటకు పంపి షెడ్ వేసి భూమిని ఆక్రమించినట్లు ఆరోపించారు. బాధితురాలికి తక్షణమే న్యాయం చేసి భూమిని తిరిగి అప్పగించాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## చలో కొత్తగూడెం ధర్నాకు తరలిన కార్మికులు




**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో సేవ్ సింగరేణి చలో కొత్తగూడెం ధర్నా కార్యక్రమంనకు వంద లాది కార్మికులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంనకు బయలు దేరిన వాహనాలకు బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్ జెండా ఊపి జాత ప్రారంభించారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం, సింగరేణి సంస్థ రక్షణకు ఏఐటియుసి రాజి లేని పోరాటం చేస్తుందని, మేనేజ్మెంట్ వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ జాత కార్యక్రమం నకు వైస్ ప్రెసిడెంట్ ఎంవి. రాంనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ఆఫీసు బేరర్స్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, గోలి గంగాధర్ బి, సురేందర్, ఏ. రాజశేఖర్, పిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి. రవీందర్, జి. శ్రీనివాస్, జి. శరత్, సాయి ప్రకాష్ చారి, ఎగ్జిక్యూటివ్, కౌన్సిల్, మైన్స్ అండ్ సేఫ్టీ కమిటీ మెంబెర్స్, సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు వందలాది కొత్తగూడెం బయలు దేరి వెళ్లారు.

## ఆశీల్ పాట వాయిదా

**ప్రజాపక్షం/భద్రాచలం :** మద్దతు ధర రాకపోవడంతో సోమవారం గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఆశీల్ పాట సరైన మద్దతు ధర రాకపోవడంతో మంగళవారం నాటికి వాయిదా వేశారు. వాహనాల ఆశీల్ పాట పూర్తి కావడంతో గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉంది. కాగా సోమవారం పాట నిర్వహించినప్పటికీ గిరిజన అభ్యర్థుల నుండి సరైన మద్దతు ధర రాకపోవడంతో వాయిదా వేశారు.

# నగరంలో జోరుగా 'అరైవ్-అలైవ్'

### డ్రైవర్లకు సిఐలు అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారించేందుకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రజలు, వాహనదారుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 'అరైవ్అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను తెలియజేస్తున్నారు. సోమవారం ఖమ్మం టౌన్ ఏసిపి ఎస్‌వి రమణమూర్తి పర్యవేక్షణలో ఖమ్మం వన్ టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయా స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ వద్ద సిఐ కరుణాకర్ సిబ్బందితో కలిసి డ్రైవర్లు, వాహనచోదకులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బైపాస్ రోడ్డు ఎన్టీర్ సర్కిల్ సమీపంలో టూటౌన్ సిఐ బాలకృష్ణ స్థానిక ట్రాలీ, ఆటో, వ్యాన్ డ్రైవర్లు, వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు డ్రైవర్లు సీటు బెల్ట్ పేట్టుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అందరిబాధ్యత అన్నారు. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నిడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ఫలితంగా వారి ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలకు నష్టం కలిగిస్తున్నారన్నారు. నష్టం జరిగితే కుటుంబాలకు తీరని విషదం మిగులుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వాహనచోదకులు, డ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/ వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులో మండల ప్రజాపరిషత్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్ అన్నారు. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు శ్రీకాంత్‌కు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు సుశీల మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే ప్రజాప్రతినిధిగా ఎన్నికై నిత్యం ప్రజల మధ్యలో ఉంటున్న శ్రీకాంత్‌ను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలను కౌన్సిలర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. అనంతరం కౌన్సిలర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎ రాందాస్ నాయక్ సహకారంతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి భాగ్యమ్మ, దూరిశెట్టి నర్సింహారావు, చింతపల్లి జయరాజు, ముత్యాల కోటేశ్వరరావు, దాసరి నాగరాజు, గాజుల మహేష్, పుల్లూరి మహేష్, రాయపుడి కన్నయ్య, కురిశెట్టి పద్మ, పూర్ణయ్య, నవ్య, సురేష్, రఫీ, నరేష్, పృథ్వీ, సాగర్, రుషి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# జరభద్రం..!



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఇద్దరి చిన్నారుల మరణం వెనుక తప్పు ఎవరిది. తన పొలంలో మట్టి అమ్ముకున్న రైతుదా లేక ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకోని అధికారులదా లేక ఆ చిన్నారుల మరణం వెనుక ప్రతి ఒక్కరి పాత్ర ఉందా అంటూ ప్రశిస్తున్నాయి ప్రజా గొంతుకలు. నీటి గుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం స్థానికంగా తీవ్ర ఆవేదన, ఆగ్రహం రేకెత్తిస్తుంది. "మట్టి మాఫియా" అనే ఒకే పదంతో వ్యవహారం ముగించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఈ విషాదానికి అసలు బాధ్యత ఎవరిది అనే ప్రశ్నకు సమగ్ర సమాధానం అవసరం. మొదటిగా, అనుమతులు లేకుండా భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పుడు వాటిని పర్యవేక్షించాల్సిన మైనింగ్ శాఖ ఎక్కడ ఉంది. సుమారు 20 నుండి 30 అడుగుల లోతులో గుంటలు తవ్వబడుతున్నా, ఆ ప్రక్రియపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం స్పష్టంగా పరిపాలనా వైఫల్యాన్ని సూచిస్తుంది. అదే విధంగా అధిక టన్నేజీతో వాహనాలు రహదారులపై నిర్బంధం లేకుండా సంచరిస్తుంటే రవాణా శాఖ అధికారులు ఎందుకు స్పందించలేదనేది అంతుచిక్కని ప్రశ్న. స్థానిక పోలీస్ శాఖ కూడా ఘటన జరిగే వరకు మౌనంగా ఉండడం ప్రశ్నార్థకంగా మారింది. గ్రామ స్థాయి పాలనలో భాగమైన సర్పంచ్, పంచాయితీ అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. పైనుండి ఒత్తిడి వచ్చిందా లేక గ్రామం బాగుకోసం ఆర్థిక వనరులు చేకూరాయా, రెవెన్యూ శాఖకు చెందిన వీఆర్వో, ఆర్ఐ, తహశీల్దార్ వంటి అధికారులు ఆ వైపుగా తనిఖీ చేయకపోవడం కూడా మిలియన్ డాలర్ల ప్రశ్న. సింగరేణి ప్రభావంతో భూమి కోల్పోతామనే భయంతో కొందరు రైతులు మట్టిని అమ్ముకోవడం వాస్తవం. ఇది వారి ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన నిర్ణయం. కానీ ఆ మట్టిని కొనుగోలు చేసి వ్యాపారం చేసిన వారిపై మాత్రమే నిందలు మోపడం సముచితం కాదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తవ్వకాలు పూర్తయిన తర్వాత గుంటలను అలాగే వదిలేయడం వల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాటిని చేపల పెంపకానికి ఉపయోగిస్తున్నప్పటికీ, భద్రతా చర్యలు తీసుకోకపోవడం మత్స్యశాఖ నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. ఈ నేపథ్యంలో మీడియా పాత్ర కూడా ప్రస్తావనీయమే. ఇప్పటికే ఇలాంటి అక్రమాలపై వార్తలు వెలువడినా, సంబంధిత శాఖలు స్పందించకపోవడం గమనార్హం. గతంలో కాకర్లపల్లి గ్రామంలో సైతం ఇలాంటి ఘటనలో చిన్నారులు మృతి చెందారు. కొద్ది రోజుల హడావుడి తర్వాత వ్యవహారం మామూలైపోయింది. అదే పరిస్థితి మళ్లీ పునరావృతమయింది. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు చిన్నారులు ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఒకరు, వేంసూరు మండలానికి చెందిన మరొకరు ఉండటం కలచివేస్తుంది. చిన్నారుల మృతి ముమ్మాటికి వ్యవస్థల వైఫల్యంగా బావించాలి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనకు ఒకరిని మాత్రమే బాధ్యులుగా చూపడం కంటే, మైనింగ్, రెవెన్యూ, పోలీస్, రవాణా, పంచాయితీ, మత్స్య శాఖల సమిష్టి నిర్లక్ష్యాన్ని ప్రశ్నించాలి. బాధ్యత ఎక్కడ ఉందో అక్కడే నిర్ణయించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

### యాది మరిస్తే ఇబ్బందే..





**తల్లిదండ్రుల్లారా తస్మాత్ జాగ్రత్త..!**

**బిడ్డల జాడ తెలుసుకోండి...**

వేసవికాలం సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్తగా ఉంటూ తమ బిడ్డల జాడను కనిపెడుతుండాలి. వేసవికాలం సెలవులు కావడంతో చిన్నారులు ఆటపాటల కోసం కనుచూపుమేరలో కనిపించకుండా పోతుంటే ఓ కన్నెయ్యండి, మీ బిడ్డల జాడను ఎప్పటికప్పుడు తెలుసుకోండి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అంతా జరిగాక వ్యవస్థలను నిందించడం కంటే మన కంటిపాపలను మనమే కాపాడుకుందాం.

## మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలి

### -కలెక్టర్‌కు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దొండపాటి రమేష్ మాట్లాడుతూ మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది తప్ప కొనుగోలు చేయడం లేదని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మొక్కజొన్న పంట చేతికి వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్కువ ధరకు దళారులు, ప్రైవేటు వ్యాపారులకు మొక్కజొన్న విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర రూ. 2,400 లకు కొనుగోలు చేపట్టాలని ఆయన కోరారు. మొక్కజొన్న కొనుగోలు చేయడంతో పాటు సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు కూడా జమ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా సమితి తరుపున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రైతులు టి. వెంకటేశ్వర్లు, నర్సారావు, నాగయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కోసం రోడ్డెక్కిన ప్రజలు





**ప్రజాపక్షం/ వైరా :** వైరాలో వంట గ్యాస్ కోసం ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. సోమవారం వైరాలో సోమవరం గ్రామ సమీపంలో ఉన్న ఇండియన్ గ్యాస్ వద్ద ఉదయం నుంచి పెద్ద ఎత్తున వినియోగదారులు గ్యాస్ సిలెండర్లతో అక్కడకు చేరుకున్నారు. నిర్వాహకులు సరైన సమాధానం చెప్పకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారుల వద్దకు వచ్చి ప్రజలతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గ్యాస్ బుక్ చేసినా నేటికి అందించడం లేదని తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని నిర్వాహకులు సరైన సమాధానం తెలపడం లేదన్నారు. అనంతరం సివిల్ సప్లయ్ అధికారులు గోడౌన్ వద్దకు వచ్చి విచారణ చేపట్టారు.

## సుబ్లేడు మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గ్రామీణ ప్రాంత ప్రజలకు సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం ఎంతో ప్రయోజనం కలిగించిందని స్థానిక సర్పంచ్ సంఘ భక్తుల సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన ప్రగతి ప్రణాళికలో భాగంగా సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వసుంధర నేతృత్వంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించింది మొదట వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వైద్య శిబిరానికి సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా హాజరయ్యారు. సుమారు 312 మంది హాజరై వివిధ వైద్య నిపుణులకు తమ ఆరోగ్య సమస్యలను తెలుపుతున్నారు. వైద్యులు పరీక్షించిన అనంతరం వారికి తగు వైద్య సూచనలు సలహాలు చేశారు. కొందరి ఆరోగ్య పరిస్థితి పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రధాన ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. మిగతా వారి సమస్యలకు ఔషధాలు ఇచ్చి వారికి వైద్య సలహాలు ఇచ్చారు. ఇటీవల ఆరోగ్య కేంద్ర పరిధిలో క్షయ వ్యాధి నివారణకు డాక్టర్ వసుంధర చేపడుతున్న సేవలకు ఉత్తమ ప్రతిభ అవార్డు అందుకున్న ఆమెను స్థానిక సర్పంచ్ స్వాతి సుమన్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోగులను పరీక్షించిన వైద్యులు డాక్టర్ ప్రశాంతి జెనరల్, శ్రీవిద్య స్త్రీ, మాలిక్ ఆర్థోపెడిషన్,రాంబాబు పీడియాట్రీషన్, అశ్విని ఆప్తో మోలో జిస్ట్, నరేష్ డెంటిస్ట్ గ్రామ పెద్దలు సంఘ బత్తుల సుమన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్ ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.